క్లుప్తంగా

స్నానఘాట్ల వద్ద అప్రమత్తంగా ఉండాలి

పటమట(విజయవాడతూర్పు): దసరా ఉత్సవాలకు వచ్చే భక్తులు స్నానఘాట్ల వద్ద వదిలే వస్త్రాలను ఎప్పటికప్పుడు కన్వేయర్ బెల్ట్ ద్వారా ఒడ్డుకు తీసుకురావాలని, అక్కడి నుంచి వెంటనే వాటిని తరలించాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. నగర పర్యటనలో భాగంగా ఆయన శుక్రవారం సీతమ్మ పాదాలు వద్ద ఉన్న కన్వేయర్ బెల్ట్ ద్వారా తరలిస్తున్న వస్త్రాలను పరిశీలించారు. దసరా నవరాత్రుల ఉత్సవాల్లో అమ్మవారి దర్శనానికి వచ్చే ప్రజలు ఎటువంటి ఇబ్బందులు లేకుండా నవరాత్రులలో విజయవాడ నగరపాలక సంస్థ వారు చేసిన ఏర్పాట్లలో ఎటువంటి లోటు లేకుండా చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఉత్సవాల్లో విధులు నిర్వహిస్తున్న అధికారులందరూ అప్రమత్తంగా ఉంటూ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని, తాత్కాలిక మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు శుభ్రపరుస్తూ పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా నిర్వహిస్తూ, తాగునీరు అందించడంలో లోపం లేకుండా క్యూలైన్ల వద్దనే అందిస్తుండాలని అధికారులను ఆదేశించారు.

కార్మికులకు దుస్తులు పంపిణీ

ఆటోనగర్(విజయవాడతూర్పు): పేదలకు సేవచేయడంలో ఉన్న సంతృప్తి ఎందులోనూ ఉండదని మాజీ జమాక్ స్టోర్స్ చైర్మన్ కత్తిక శివనాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఆటోనగర్‌లోని ఏపీఎంఎస్‌ఎంఈ కార్యాలయ ఆవరణలో ఆయన చేతుల మీదుగా ఐలా పారిశుధ్య కార్మికులు 70 మందికి రూ.70 వేలు విలువైన దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ గద్దె శేషగిరి మాట్లాడుతూ శివనాగేశ్వరరావు పారిశుధ్య కార్మికులకు దుస్తులు ఇవ్వడం ఆనందదాయకమన్నారు. కరోనా కాలంలో కూడా సహాయం అందించారన్నారు. జిల్లా లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ శ్రీశాంతి, లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ పర్వతనేని సుభాష్ చంద్రబోస్, ఎం.ఉపేంద్ర, జిల్లా లయన్స్ క్లబ్ అధికారి బెవర నాగేశ్వరరావు, ఐలా మాజీ కార్యదర్శి అన్నే శివనాగేశ్వరరావు, కలాం బ్యాటరీ వర్క్స్ అధినేత అబ్దుల్ కలాం పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై ట్రాఫిక్ వామ్మో!

- నిత్యం బారులు తీరుతున్న వాహనాలు
- ట్రాఫిక్ క్రమబద్ధీకరించేందుకు పూర్తి స్థాయిలో లేని సిబ్బంది
- డేంజరస్ జోన్లలో తరచూ రోడ్డు ప్రమాదాలు
- ఉదయం, సాయంత్రం సమయాల్లో తీవ్రమైన ట్రాఫిక్ ఇబ్బందులు


రామవరప్పాడు జాతీయరహదారిపై నిలిచిన ట్రాఫిక్

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలంలో జాతీయ రహదారిని అనుకుని ఉన్న పలు గ్రామాల ప్రజలను నిత్యం ట్రాఫిక్ సమస్య పట్టి పీడిస్తోంది. రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు, గూడవల్లి తదితర గ్రామాలు జాతీయ రహదారిని ఆనుకుని ఉన్నాయి. దీంతో ఏ చిన్నపాటి అవసరం వచ్చినా ఆయా గ్రామాల వారు జాతీయ రహదారి పైకి రావాల్సిందే. నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించే ఈ రహదారిపై నిత్యం ట్రాఫిక్ స్తంభిస్తోంది. గన్నవరం, ఉంగుటూరు, విజయవాడ రూరల్ మండలాల మీదుగా నిత్యం జాతీయరహదారిపై వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో పలు సందర్భాల్లో గంటల కొద్దీ వాహనాలు నిలిచిపోతున్నాయి. జాతీయ రహదారిని ఆనుకుని పలు కళాశాలలు, కార్పొరేట్ పాఠశాలలు ఉన్నాయి. దీంతో ఉదయం, సాయంత్రం రహదారిపై తీవ్ర రద్దీ ఏర్పడుతోంది. ట్రాఫిక్ చక్రబంధంలో ఇరుక్కుని నిర్ణీత సమయానికి గమ్యస్థానం చేరుకోలేకపోతున్నామని ప్రయాణికులు, విద్యార్థులు పలు గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ పోలీసులు లేకపోవడంతో పాఠశాల విద్యార్థులు, వృద్ధులు రహదారి పైకి రావాలంటేనే భయపడుతున్నారు.

నిత్యం వాహనాలు బారులు...

పలు గ్రామాల్లో ముఖ్యంగా పలు కూడళ్లలో నిత్యం ట్రాఫిక్ స్తంభిస్తుంది. రామవరప్పాడు రింగ్, పేరంటాలమ్మ ఆలయ సెంటర్, వంతెన సెంటర్, ప్రసాదంపాడు ప్రధాన సెంటర్, ఎనికేపాడు ఎస్సార్కే కళాశాల, 100 అడుగుల రోడ్డు మలుపు వద్ద, నిడమానూరు భారతీ వాల్ మార్ట్, చైతన్య కళాశాల, గూడవల్లి సెంటర్ తదితర కూడళ్లలో నిత్యం వాహనాలు బారులు తీరుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారని పలు గ్రామాల వారు ఆరోపిస్తున్నారు. డేంజరస్ ఏరియాలుగా పిలువబడే ఈ ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. ఒక్క రామవరప్పాడులోనే ఇటీవల సుమారు 8 మందికి పైగా మృత్యువాత పడ్డారు. పలువురు క్షతగాత్రులయ్యారు.

మరో బెంజిసర్కిల్‌లా మారిన రామవరప్పాడు రింగ్

నగరంలోని బెంజిసర్కిల్ వద్ద నిత్యం ట్రాఫిక్ ఏ రేంజ్‌లో నిలుస్తుందో ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. రూరల్ పరిధిలో ఉన్న రామవరప్పాడు రింగ్ ట్రాఫిక్ విషయంలో మరో బెంజిసర్కిల్‌లా మారింది. హనుమాన్‌జంక్షన్ నుంచి వచ్చే భారీ వాహనాలు, ఇతర వాహనాలు జాతీయ రహదారి మీదుగా రామవరప్పాడు రింగ్‌కు చేరుకుంటాయి. అక్కడి నుంచి అవసరాన్ని బట్టి బెంజిసర్కిల్, ఫ్లై ఓవర్ మీదుగా వెళతాయి. పలు వాహనాలు రింగ్ వద్ద యూటర్న్ తీసుకుంటూ ఇన్నర్ రింగ్ రోడ్డు ఎక్కుతున్నాయి. ఈ సమయంలో రామవరప్పాడు సర్కిల్‌లో భారీగా ట్రాఫిక్ నిలిచిపోతోంది.

ప్రత్యామ్నాయ రహదారిని పట్టించుకోరే?

రామవరప్పాడు రింగ్ సమీపంలో హైటెన్షన్ వైర్ల కింద నుంచి వెళ్లే ప్రత్యామ్నాయ రహదారిని పట్టించుకుంటే భవిష్యత్‌లో భారీ వాహనాలకు అతి సులువైన మార్గం అవుతుంది. కరెన్సీ నగర్ సమీపంలో హైటెన్షన్ వైర్ల కింద 80 అడుగుల రహదారి ఉంది. ఈ రహదారి సరాసరి నిడమానూరు జాతీయ రహదారిని కలుస్తుంది. ఈ రహదారిలో ఉన్న కొద్దిపాటి ఆక్రమణలు తొలగించి అభివృద్ధి పరిస్తే నిడమానూరు నుంచి రామవరప్పాడు వరకూ జాతీయ రహదారిపైకి వాహనాలు ఎక్కాల్సిన అవసరం ఉండదు. గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి వచ్చే ఎమ్మెల్యేలు, మంత్రుల కాన్వాయ్‌లు కూడా ఈ ప్రత్యామ్నాయ మార్గంలో ఎవరికీ ఇబ్బంది లేకుండా వెళ్లవచ్చు. దీంతో చాలా వరకూ ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టవచ్చు. నిత్యం వేధిస్తున్న ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని, ప్రత్యామ్నాయ రహదారి అంశాన్ని దృష్టిలో పెట్టుకోవాలని ప్రయాణికులు, పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పాడి రైతులకు రూ.4.70 లక్షలు బోనస్ పంపిణీ



గన్నవరం: మండలంలోని దావాజిగూడెం పాల సొసైటీలో శుక్రవారం పాడి రైతులకు రూ.4.70 లక్షల బోనస్‌ను పంపిణీ చేశారు. సొసైటీ అధ్యక్షుడు గొంది నరేంద్ర, విజయ డెయిరీ క్లస్టర్ మేనేజర్ కె.వెంకటేశ్వరరావు చేతుల మీదుగా 142 మంది పాడి రైతులకు బోనస్ నగదును అందజేశారు. అనంతరం అత్యధికంగా గేదె, ఆవు పాలు సరఫరా చేసిన నలుగురు రైతులకు వెండి నాణేలు, మరో 100 మందికి వెట్ గ్రైండర్లను బహుమతిగా అందజేశారు. రూట్ సూపర్‌వైజర్ షేక్ యాసిన్, పలువురు పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కంకిపాడు సీహెచ్‌సీ ప్రహరీ నిర్మాణానికి నిధులు

కంకిపాడు: కంకిపాడు సామాజిక ఆరోగ్యకేంద్రం చుట్టూ ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. ప్రభుత్వం నుంచి రూ.54 లక్షలు నిధులు కేటాయించటంతో ఏపీఎంఐడీసీ డీఈ సత్యనారాయణ, నిర్మాణ సంస్థ అధినేత అంజిరెడ్డి, సీహెచ్‌సీ మాజీ చైర్మన్ యలమంచిలి కిషోర్‌బాబుతో కలిసి శుక్రవారం ఆసుపత్రి ప్రాంగణాన్ని పరిశీలించారు. ఆసుపత్రి చుట్టూ ప్రహరీ నిర్మాణంతో మౌలిక వసతుల కల్పన, భద్రత మరింత పెరుగుతుందన్నారు.

రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంతో అందని రేషన్


రేషన్ సరుకులు స్వాధీనం చేసుకుంటున్న వీఆర్‌వో

ఉంగుటూరు: రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం వలన మండల కేంద్రమైన ఉంగుటూరులో ఈ నెలలో ఇప్పటివరకు కార్డుదారులకు రేషన్ సరుకులు అందలేదు. ఉంగుటూరు రేషన్ షాపు నంబరు 8కి డీలర్‌గా గ్రామానికి చెందిన సంబంగి శ్రీనివాసరావు 2015 నుంచి పని చేస్తున్నారు. ఈ ఏడాది జూలై 2న శ్రీనివాసరావు ఆకస్మికంగా మృతిచెందారు. నాటి నుంచి ఆయన భార్య సంబంగి అమరేశ్వరి రేషన్ డీలర్‌గా వ్యవహరిస్తూ ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రజలకు రేషన్ సరుకులు పంపిణీ చేస్తున్నారు. శ్రీనివాసరావు మృతితో ఏర్పడిన డీలర్ పోస్టు ఖాళీని సెప్టెంబర్ 2న అదే గ్రామానికి చెందిన జి.అనూషకు డ్వాక్రా గ్రూపు ద్వారా రెవెన్యూ అధికారులు భర్తీ చేశారు. కొత్త డీలరును నియమించినప్పటికి రేషన్ సరుకులు పాత డీలరు వద్ద నుంచే పంపిణీ చేయడంతో గందరగోళం ఏర్పడింది. సెప్టెంబర్ నెలలో పీడీఎస్ సరుకులను పాత డీలరు పంపిణీ చేయగా, వరదల కారణంగా నిర్వాసితులకు రేషన్ సరుకులను కొత్త డీలరుతో పంపిణీ చేయించారు. మళ్లీ అక్టోబర్ నెలలో రేషన్ బియ్యం, పంచదార, మంచినూనె తదితరాలను రెవెన్యూ అధికారులు పాత డీలరుకే కేటాయించి పంపిణీ కోసం సరుకులు అప్పగించారు. అంగన్ వాడీ కేంద్రాలకు వచ్చిన కొన్ని సరుకులను మాత్రం కొత్త డీలర్‌కు కేటాయించారు. పాత డీలర్‌కు రేషను సరుకులు అప్పగించిన రెవెన్యూ అధికారులు ఈపోస్ యంత్రంలో మాత్రం కొత్త డీలరు పేరు నమోదు చేయడంతో కొత్త, పాత డీలర్ల మధ్య సరుకుల పంపిణీ వివాదం మొదలైంది. నెలలో సగం రోజులు గడుస్తున్నప్పటికీ కార్డుదారులకు రేషన్ సరుకులు అందకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాత డీలర్‌ను తొలగించి కొత్త డీలరును నియమించే క్రమంలో రెవెన్యూ అధికారులు నిబంధనలు పాటించకపోవడం వల్లే ఈ గందరగోళం ఏర్పడిందని గ్రామస్తులు అంటున్నారు. ఇంతలో పాత డీలరు హైకోర్టుకు వెళ్లి స్టే ఆర్డర్ తీసుకు రావడంతో మరింత ఉత్కంఠ నెలకొంది. ఈనెల 14వ తేదీ వరకు ఉంగుటూరు రేషన్ షాపుపై రెవెన్యూ అధికారులు ఎటువంటి నిర్ణయం తీసుకోరాదని, పాత విధానాన్నే కొనసాగించాలని హైకోర్టు ఆర్డరులో పేర్కొంది. ఈ నేపథ్యంలో రేషన్ సరుకులు తమకు ఎందుకు అందలేదని ప్రజలు అధికారులను నిలదీయటంతో కొత్త, పాత రేషన్ డీలర్ల వద్ద ఉన్న సరుకులను వీఆర్‌ఓ రామారావు స్వాధీనం చేసుకున్నారు. దీనిపై తహసీల్దారు విమల కుమారిని వివరణ కోరగా హైకోర్టు ఆర్డర్ ప్రకారం ఈ నెల 14వరకు ఆగి తరువాత నిర్ణయం తీసుకుంటామని, ప్రస్తుతం ప్రజలకు ఇబ్బంది కలుగకూడదని పక్క రేషన్ షాపు డీలర్ల వద్ద నుంచి రేషన్ సరుకులు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం వలన దసరా పండగ నెలలో పస్తులుండాల్సిన దుస్థితి నెలకొందని పేదలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రేషన్ సరుకుల పంపిణీలో స్పష్టత తీసుకువచ్చి రేషన్ సరుకులు అందించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ పూజలు

పెనమలూరు: పెనమలూరు పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం డీఎస్పీ చలసాని శ్రీనివాసరావు దంపతులు పూజలు చేశారు. దసరా పండుగ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారులు డీఎస్పీతో ప్రత్యేక పూజలు చేయించారు. సీఐ వెంకటరమణతో పాటు ఎస్‌ఐలు, పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

జగన్మాతా.. కరుణించమ్మా...


అమ్మవారికి హారతి ఇస్తున్న అర్చకులు

ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ శుక్రవారం శ్రీమహిషాసురమర్దనిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దసరా ఉత్సవాలు ముగియనుండటంతో పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం భవానీలు కొండపైకి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. జగన్మాతా.. కరుణించమ్మా అంటూ భక్తులు అమ్మవారిని వేడుకున్నారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ


జల్లు స్నానాలు చేస్తున్న భవానీలు


అమ్మవారి సన్నిధిలో సినీ నటి అనన్య నాగళ్ళ

దేశం గర్వించదగ్గ వ్యక్తి రతన్ టాటా



హనుమాన్‌జంక్షన్ రూరల్: దేశం గర్వించదగ్గ పారిశ్రామికవేత్త, గొప్ప మానవతావాది రతన్ టాటా మరణం తీరని లోటని వేలేరు గ్రామస్తులు కొనియాడారు. బాపులపాడు మండలం వేలేరులో శుక్రవారం రతన్‌టాటా సంతాపసభను గ్రామస్తులు నిర్వహించారు. తొలుత రతన్‌టాటా చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. రతన్ టాటా జీవితం నేటి తరం యువతకు ఆదర్శప్రాయమని కొనియాడారు. మాజీ సర్పంచ్ వేములపల్లి శ్రీనివాసరావు, గ్రామ ప్రముఖులు పాతూరి కొండలరావు, కాజా సురేష్, అంగడాల సీతారామయ్య, ఆవిరేన్ని ప్రసాద్, గోళ్ల శివనాగ మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

పెనమలూరులో మద్యం షాపులకు భారీగా టెండర్లు

- తాడిగడపకు 160 దరఖాస్తులు
- పెనమలూరుకు 92 దరఖాస్తులు
- దరఖాస్తులకు అందిన రుసుము రూ.50.40 కోట్లు

పెనమలూరు: కూటమి ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెట్టిన మద్యం పాలసీకి ఆరంభంలోనే కాసుల వర్షం కురిసింది. మండల పరిధిలో 8 మద్యం షాపులకు ప్రభుత్వానికి దరఖాస్తుల రూపేణా రూ.50.42 కోట్లు ఆదాయం వచ్చింది. మద్యం షాపులకు తీవ్ర పోటీ ఉండటంతో భారీగా దరఖాస్తులు అందాయి. పెనమలూరు మండలంలో 5 మద్యం షాపులు, తాడిగడప మున్సిపాలిటీలో కేవలం 3 మద్యం షాపుల ఏర్పాటుకు ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చింది. తాడిగడప మున్సిపాలిటీకి కేవలం 3 మద్యం షాపులే కేటాయించటంతో మద్యం షాపులకు విపరీతమైన పోటీ ఏర్పడింది. తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో కేటాయించిన షాపు నంబర్ 23కి దరఖాస్తులు 52 అందగా దరఖాస్తు రుసుం రూ.10.40 కోట్లు వచ్చింది. షాపు నంబర్ 24కి దరఖాస్తులు 57 రాగా రుసుం రూ.11.40 కోట్లు, షాపు నంబర్ 25కు దరఖాస్తులు 51 అందగా రుసుం రూ.10.20 కోట్లు వచ్చింది. తాడిగడపకు మొత్తం 3 మద్యం షాపులకు 160 దరఖాస్తులకు గాను దరఖాస్తు రుసుం రూ.32 కోట్లు ప్రభుత్వ ఖజానాకు జమ అయింది. ఇక పెనమలూరు మండలంలో 5 మద్యం షాపులకు దరఖాస్తులు 92 అందగా దరఖాస్తు రుసుం రూ.18.40 కోట్లు అందింది. షాపు నంబర్ 26, 28లకు 16 చొప్పున దరఖాస్తులు, మిగతా 3 షాపులకు 20 చొప్పున దరఖాస్తులు దాఖలు అయ్యాయి. తాడిగడప మున్సిపాలిటీలో షాపునకు సగటున 53 దరఖాస్తులు అందాయి. మద్యం షాపుల కేటాయింపునకు 14వ తేదీన లాటరీ తీస్తారు.

భక్తులకు మజ్జిగ, పాలు పంపిణీ



గన్నవరం: ఇంద్రకీలాద్రిపై శ్రీకనక దుర్గమ్మ దర్శనం నిమిత్తం సుదీర్ఘ ప్రాంతాల నుంచి తరలివస్తున్న భక్తులకు శుక్రవారం స్థానిక గాంధీబొమ్మ సెంటర్‌లో శ్రీవరమహాలక్ష్మి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మజ్జిగ, పాలు పంపిణీ చేశారు. ట్రస్టు చైర్మన్ గండికోట వరలక్ష్మి ఆధ్వర్యంలో పాదయాత్రగా వెళ్తున్న భక్తులకు మధ్యాహ్నం మజ్జిగ సరఫరా చేశారు. సాయంత్రం భక్తులకు పాలు పంపిణీ చేశారు. స్థానిక పెట్రోల్ బంక్ వద్ద పలువురు ఫ్రూట్ మర్చంట్స్ ఆధ్వర్యంలో భవానీలకు పండ్లు, మజ్జిగ పంపిణీ చేశారు.

పాహిమాం.. పాహిమాం.. మాతా!

శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తొమ్మిదో రోజు మహార్నవమి సందర్భంగా వివిధ ఆలయాల్లో అమ్మవారిని మహిషాసుర మర్దనిగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాలకు వెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు. -సాక్షి నెట్‌వర్క్


ఉయ్యూరు: పెద ఓగిరాలలో మహిషాసురమర్దనిగా...


కంకిపాడు: ఆర్యవైశ్య ప్రార్థనా మందిరంలో శ్రీవిజయలక్ష్మీదేవిగా...


పెనమలూరు: యనమలకుదురులో సిద్ధిధాత్రిదేవిగా...


రామవరప్పాడు: మహిషాసుర మర్దనిగా పేరంటాలమ్మ


విజయవాడరూరల్: నున్న చినకంచిలో మహిషాసుర మర్దనిగా...